వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 323 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మే 2025 | వెల : రూ 10/-




## నేవీ రంగంలోకి దిగివుంటే పాక్ ముక్కలయ్యేది

- నేవీ మౌనంగా ఉంటూనే శత్రువుకు దడ పుట్టించింది
- ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నుంచి పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్

న్యూఢిల్లీ,మే 30 ప్రజా స్వేచ్ఛ

పాకిస్థాన్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కనుక రంగలోకి దిగి ఉంటే.. పాకిస్థాన్ నాలుగు ముక్కలై ఉండేదని అన్నారు. యుద్ధం సమయంలో భారత నేవీ మౌనంగా ఉంటూనే.. శత్రువుల గుండెల్లో దడ పుట్టించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నేవీ పాత్రను -మిగతా 3 లో



## ఒకే విడతలో నీట్ ప్రవేశ పరీక్ష

- సుప్రీం ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ, మే 30 ప్రజా స్వేచ్ఛ

నీట్ పీజీ 25 ప్రవేశ పరీక్ష విషయంలో సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రవేశ పరీక్షను జూన్ 15న రెండు విడతల్లో నిర్వహించి, జులై 15 న ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డు ( ఎన్ఈబీ) ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి. పరీక్షను రెండు విడతల్లో నిర్వహించడం వల్ల ప్రశ్నల క్లిష్టత స్థాయి మారి కొందరు విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని ఎన్ఈబీ నిర్ణయంపై ఆందోళన వ్యక్తమైంది. అందుకే దానిని ఒకే విడతలో నిర్వహించేలా బోర్డ్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీం లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. -మిగతా 3 లో




### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ
## పర్యటన వాయిదా..!

వాయిదా పడడంతో టీపీసీసీ పోస్టుల ఆశావహులు అసంతృప్తి

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన వాయిదా పడింది. దీంతో మంత్రి వర్గ విస్తరణ, టీ పీసీసీ పోస్టుల భర్తీ ఆశావహులకు ఆడియాశలు ఎదురయ్యాయి. సీఎం ఢిల్లీకి వెళ్లగానే మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం వెలువడుతుందని అందరూ భావించారు. కానీ ఆయన పర్యటన అర్ధాంతరంగా వాయిదా పడడంతో ఆశావహులు తీవ్ర అసంతృప్తి తో ఉన్నట్లు సమాచారం.అయితే ఢిల్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డికి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌కు పార్టీ హైకమాండ్ నుంచి పిలుపు అందింది. శుక్రవారం పార్టీ -మిగతా 3 లో



### బ్రహ్మోస్‌తో పాక్‌కు
## నిద్రలేని రాత్రులు



ఆపరేషన్ సిందూర్ ముగియలేదు

- వందల మైళ్లు చొరబడి ఉగ్రస్థావరాలపై దాడి
- స్వదేశీ తయారీ ఆయుధాలతోనే బుద్ధి చెప్పాం
- మన సాయుధ సంపత్తి సత్తాను గుర్తించిన ప్రపంచం
- కాన్పూర్ సభలో ప్రధాని మోడీ ప్రసంగం

కాన్పూర్ మే 30 ప్రజా స్వేచ్ఛ

ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ ఆయుధ శక్తికి యావత్ ప్రపంచం కళ్లారా చూసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మన క్షిపణి వ్యవస్థలు ధ్వంసం చేశాయన్నారు. -మిగతా 3 లో



### ఆ దయ్యాలు ఎవరో
## కవితే చెప్పాలి

- ప్రజల్లో దయ్యాల గురించి ఆసక్తి
- బీఆర్ఎస్-బీజేపీ బంధంపై కవితనే చెప్పారు
- మంత్రి పొంగులేటి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్,

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యవహారం ఇప్పడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. శుక్రవారంగాంధీభవన్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి చిట్‌చాట్ చేశారు. కవిత ఎపిసోడ్ టీ- కప్పులో తుఫాన్ అని కొట్టిపారేశారు. ఒకరు ఆడమంటారు మరొకరు ఆడతారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కటి కాదు చాలా తప్పులు చేశారని... అన్నిటికి శిక్ష తప్పదని వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్ దగ్గర దెయ్యాలు ఉన్నాయని కవిత అంటున్నారని.. ఆ దెయ్యాలు ఎవరో కవితనే చెప్పాలని అన్నారు. దేవుడు, దెయ్యాలు అంటున్న -మిగతా 3 లో

## కాళేశ్వరం ప్రపంచ అద్భుతాల్లో ఒకటి



- బీఆర్ఎస్ హయాంలో రూ. 3.5 లక్షల కోట్ల పెట్టుబడులు
- లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు
- తొమ్మిదేళ్ల తెలంగాణ విజయంపై కేటీఆర్ ప్రసంగం

హైదరాబాద్, మే 30 ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. పదేండ్లలో 8 వేలకు పైగా అనుమతులు, రూ. 3.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దీంతో లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని -మిగతా 3 లో



### కాశ్మీర్ సమస్యను
## రగిల్చిందే కాంగ్రెస్

- 75 ఏళ్లయినా రావణకాష్టంలా రగులుతోంది
- ఆనాడే ఇందిర పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలే
- రేవంత్ వ్యాఖ్యలు దారుణమన్న ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబద్, మే 30 ప్రజా స్వేచ్ఛ

స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన ఇంకా కశ్మీర్ సమస్య అలాగే ఉంది అంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ కాదా అని ఎంపి ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. కశ్మీర్ కి స్వతంత్రపతిపత్తి ఇచ్చి వివాదానికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీ కాదా అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి -మిగతా 3 లో




## కాళేశ్వరంపై మరోమారు కుట్రలు

- ఈటలతో హరీష్ రావు రహస్య భేటీ
- కమిషన్ ముందు ఒక్కటే సమాధానం చెప్పాలని నిర్ణయం
- కేసీఆర్ ఆదేశాలతోనే ఈటెలతో హరీష్ భేటీ
- ట్రంప్ ఒత్తిడితో పాక్‌తో యుద్ధం విరమించడం దారుణం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు

హైదరాబాద్,మే 30 ప్రజా స్వేచ్ఛ

కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని హరీష్ రావు, ఈటెల రాజేందర్ అవగాహనకు ఇచ్చారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు షామిర్ పేటలో రహస్యంగా కలిశారని అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు ఒక ఫామ్ హౌస్ లో సీక్రెట్‌గా కలిశారని ఆరోపించారు. -మిగతా 3 లో

## తెలంగాణలో మూడ్రోజులు భారీ వర్షాలు



హైదరాబద్,

రాబోయే మూడ్రోజులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న రెండు రోజులు ఆదిలాబాద్, కొమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, -మిగతా 3 లో

## సైన్యం సాహసాన్ని తక్కువ చేస్తారా

### ఆపరేషన్ సిందూర్‌పై విమర్శల

- పీవోకెను పాక్ అప్పగించింది కాంగ్రెస్ కాదా
- రేవంత్ రాహుల్ విమర్శలు దేనికి సూచన
- పాక్‌కు మద్దతుగా మాట్లాడడం దుర్మార్గం
- కవిత వ్యవహారంతో బీజేపీకి సంబంధం లేదు
- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


న్యూఢిల్లీ, మే 30 ప్రజా స్వేచ్ఛ

భారత సైన్యం విజయాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సైన్యం విజయాన్ని దేశమంతా పండుగ చేసుకుంటుంటే రేవంత్‌రెడ్డికి అది భాజపా కార్యక్రమంగా కనిపిస్తుందా అని మండిపడ్డారు. మన ఎంపీలు పార్టీలను పక్కన పెట్టి ప్రపంచమంతా తిరుగుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రపంచానికి చెబుతున్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..అసలు పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?. కాంగ్రెస్ కారణంగానే పీవోకే -మిగతా 3 లో



# పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఏ పద్ధతిలోనైనా అణిచివేస్తాం

**– రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**




**గోవా మే 30 ప్రజా స్వేచ్ఛ**

యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అక్కడ ఆయన నేవీ సైనికులను ఉద్దేశించి మాట్లాడారు. చాలా తక్కువ సమయంలోనే పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను, వాళ్ల ఉద్దేశాలను ధ్వంసం చేశామన్నారు. మనం ఎంతో శక్తివంతమైన దాడి చేశామని, ఆ దాడుల్ని విరమించుకునేలా చేయాలని పాకిస్థాన్ ప్రపంచ దేశాలను వేడుకున్నదని రాజ్‌నాథ్ తెలిపారు. మన సైనిక దళాలు ఎంతో వేగంగా, గాఢాంగా, స్పష్టమైన దాడులు చేశాయని, అసాధారణ రీతిలో ఆ దాడులు జరిగినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదులకే కాదు, వాళ్లను పెంచి పోషించే వాళ్లకు కూడా స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలిపారు. సమగ్రమైన రీతిలో సాగిన ఆపరేషన్‌లో భారతీయ నౌకాదళ పాత్ర కూడా అద్భుతమైందని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పాకిస్థానీ నేలపై ఉన్న ఉగ్ర స్థావరాలను ఐఏఎఫ్ ధ్వంసం చేస్తే, ఆరేబియా సముద్రంలో ఉన్న భారత యుద్ధ నౌకలు.. పాకిస్థానీ నేవీని తీరానికి పరిమితం చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు అని, ఉగ్రవాదంపై అది మూకుమ్మడి దాడి అని రాజ్‌నాథ్ చెప్పారు. పాక్ ఉగ్రవాదులను నాశనం చేసేందుకు ఏ పద్ధతినైనా అనుసరిస్తామని, పాక్ ఊహించలేని పద్ధతుల్లో ఆ చర్యలు ఉంటాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాకిస్థాన్ ఆడుతున్న ప్రమాదకర ఉగ్రవాద ఆట ఇప్పుడు ముగిసిందన్నారు.

# కెనడాలో ఆగని కార్చిచ్చు..

**పలు ప్రావిన్స్‌లలో ఎమర్జెన్సీ**



**కెనడా మే 30 ప్రజా స్వేచ్ఛ**

కెనడా లో కార్చిచ్చు కొనసాగుతోంది. సస్కెట్చివాన్ ప్రావిన్స్ లో కార్చిచ్చు వ్యాపించడంతో అత్యవసర పరిస్థితి విధించారు. ఇప్పటికే మానిటోబా ప్రావిన్స్ లో దీని కారణంగా దాదాపు 17 వేల మందిని ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాము తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నామని సస్కట్చెవాన్ ప్రావిన్స్ ప్రీమియర్ స్కాట్‌మో తెలిపారు.విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. సస్కట్చెవాన్ ప్రావిన్స్ నుంచి ఇప్పటికే 4 వేల మందిని తరలించారు. 6.69 లక్షల ఎకరాల్లో ఇది వ్యాపించింది. పరిస్థితి ఏమాత్రం అనుకూలంగా లేదని, రానురాను సంక్లిష్టంగా మారే అవకాశముందని సిబ్బంది చెబుతున్నారు. మాంటోబా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించారు. చిన్నచిన్న ఊళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ ఈ స్థాయి కార్చిచ్చు చూడలేదని అధికారులు చెబుతున్నారు. కాగా ప్రజలను తరలించేందుకు కెనడా వైమానిక దళం రంగంలోకి దిగింది. రెండు లేదా మూడు రోజులు వర్షం పడితేగానీ ఈ కార్చిచ్చు అదుపులోకి రాదని భావిస్తున్నారు. ఇక్కడి నుంచి వస్తున్న పొగ.. అమెరికాలోని మిన్నెసోటా, మిషిగాన్ తదితర రాష్ట్రాల వైపు వెళుతోంది. రెండు ప్రావిన్సుల్లోనే 2025లో 15 లక్షల ఎకరాలు దగ్ధమయ్యాయి. కెనడా సహజ వనరుల విభాగం లెక్కల ప్రకారం మొత్తం 6,000 కార్చిచ్చులు సంభవించి.. 3.7 కోట్ల ఎకరాలను కాల్చేశాయి. కెనడా కార్చిచ్చుల వల్ల అమెరికాలో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నట్లు ది అమెరికన్ లంగ్ అసోసియేషన్ 2025లో ఇచ్చిన స్టేట్ ఆఫ్ ది ఎయిర్ రిపోర్టు పేర్కొంది.

# 2.10 లక్షల మంది ఇందిరమ్మ లబ్దిదారులు

**వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్,మే 30 ప్రజా స్వేచ్ఛ**

ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యా యని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను 40 శాతం పేర్లు ఇవ్వమన్నాం. మిగతా 60శాతం ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. కేటీఆర్ జాబితా ఇవ్వలేదు.. అధికారులనే ఎంపిక చేయమన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచులకు 9,200 ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లోని 16 స్లమ్స్‌లో నాలుగంతస్తుల భవనాలు నిర్మిస్తాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్మిస్తాంఅని మంత్రి తెలిపారు.

# బాల్య వివాహాలు రద్దు బిల్లుకు పాక్ అధ్యక్షుడి గ్రీన్ సిగ్నల్





PRESIDENT
Islamic Republic of Pakistan

Subject: ASSENT TO THE ISLAMABAD CAPITAL TERRITORY CHILD MARRIAGE RESTRAINT BILL, 2025 (PRIVATE MEMBER'S BILL)

6. The Islamabad Capital Territory Child Marriage Restraint Bill, 2025 is assented to, as passed by the Parliament

(ASIF ALI ZARDARI)
PRESIDENT

THE PRIME MINISTER
PS (Public)'s U.O.No. 5(139)/Senate/D(E)/2025, dated: 29-05-2025

**ఇస్లామాబాద్ మే 30 ప్రజా స్వేచ్ఛ**

బాల్య వివాహాలను రద్దు చేస్తూ రూపొందించిన బిల్లుకు పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ పచ్చజెండా ఊపారు. ఆ బిల్లుపై ఆయన సంతకం చేశారు. పిల్లల హక్కులను రక్షిస్తూ, 18 ఏళ్ల లోపు చిన్నారుల పెళ్లిని రద్దు చేస్తూ బిల్లును రూపొందించారు. మే 27వ తేదీ ఆ బిల్లు అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీకి చేరింది. పార్లమెంట్ ఉభయసభల నుంచి ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. బాల్య వివాహాల రద్దు బిల్లును మత సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ బిల్లు ఇస్లామిక్ చట్టాలకు వ్యతిరేకంగా ఉందని కౌన్సిల్ ఆఫ్ ఇస్లామిక్ ఐడియాలజీ(సీఐఐ) పేర్కొన్నది. 18 ఏళ్ల లోపు పెళ్లిని అత్యాచారంగా భావించడం ఇస్లామిక్ చట్టాలకు వ్యతిరేకమని సీఐఐ తెలిపింది. బాల్య వివాహాల రద్దు బిల్లుకు చెందిన నోటీఫికేషన్‌ను అధ్యక్షుడి భవనం రిలీజ్ చేసింది.

# ప్రధాని పేరు మరిచిన నితీశ్ కుమార్..

**మోదీని ఏమని పిలిచారంటే?**



**పాట్నా మే 30 ప్రజా స్వేచ్ఛ**

బీహార్ సీఎం నితీశ్ కుమార్ మరో పొరపాటు చేశారు. వేదికపై ఉన్న ప్రధాని పేరును ఆయన మరిచిపోయారు. మోదీని అటల్ బిహారీ వాజ్‌పేయి అని పిలిచారు. దీంతో సభకు హాజరైన వారు ఇది విని షాక్ అయ్యారు. శుక్రవారం కరకట్‌లో జరిగిన బహిరంగ సభలో సీఎం నితీశ్ కుమార్ మాట్లాడారు. వేదికపై ఉన్న ప్రధాని మోదీ పేరు చెప్పడానికి ఆయన తడబడ్డారు. మోదీని అటల్ బిహారీ వాజ్‌పేయి అని సంభోదించారు. ఆ వెంటనే తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారు. 'అటల్ బిహారీ వాజ్‌పేయి గతంలో అభివృద్ధి పనులు చేశారు' అని అన్నారు. జనం పైకి లేచి ప్రధానిని అభినందించాలని ఆయన కోరారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందికాగా, జనవరిలో కూడా నితీశ్ కుమార్ వింతగా ప్రవర్తించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జరిగిన నివాళి కార్యక్రమంలో అకస్మాత్తుగా చప్పట్లు కొట్టారు. అలాగే మార్చిలో పాట్నాలో జరిగిన క్రీడా కార్యక్రమంలో జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో నితీశ్ కుమార్ నవ్వడంతోపాటు పక్కనున్న వారితో మాట్లాడారు. ఈ వీడియో క్లిప్స్ గతంలో వైరల్ అయ్యాయి.

# ఆ వీడియో డిలీట్ చేయండి..

**జర్నలిస్టుకు సుప్రీం ఆదేశం**

**న్యూఢిల్లీ మే 30 ప్రజా స్వేచ్ఛ**

యూట్యూబర్, జర్నలిస్టు అజయ్ శుక్లాపై సుమోటో కేసు నమోదుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టుకు చెందిన సీనియర్ న్యాయవాదిపై ఇటీవల శుక్లా తన యూట్యూబ్ ఛానల్‌లో వివాదాస్పద వీడియోను పోస్టు చేశారు. సీనియర్ జడ్జిని కించపరిచే విధంగా ఉన్న ఆ వీడియోను డిలీట్ చేయాలని సుప్రీం ఆదేశించింది. సీజే బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాషి, ఏఎస్ చందూర్‌కర్ ధర్మాసనం ఈ కేసును విచారించింది.



ఇలాంటి కాంటెంట్‌ను మళ్లీ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయరాదు అని కోర్టు ఆదేశించింది.వరప్రద మీడియాకు ఎడిటర్ అయిన శుక్లాకు నోటీసులు కూడా ఇచ్చింది. సీనియర్ జడ్జిపై యూట్యూబర్ శుక్లా చేసిన ఆరోపణలు తీవ్రంగా ఉన్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. శుక్లాపై సుమోటో కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. యూట్యూబ్‌లో చేసిన ఆరోపణలతో న్యాయ వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని, రాజ్యాంగం భావ స్వేచ్ఛను కల్పిస్తున్నదని, కానీ దానికి నిబంధనలు ఉన్నాయని, అత్యున్నత న్యాయస్థానానికి చెందిన జడ్జీని కించపరిచే రీతిలో ఆరోపణలు చేయడం సరైంది కాదు అని, ఇది ధిక్కరణ అవుతుందని, న్యాయ వ్యవస్థకు చెడు పేరు వస్తుందని సీజేఐ తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం

**-మరో పదేళ్లయినా కోలుకోకుండా దెబ్బతీసాం**
**-భద్రతా దళాలకు అమిత్ షా ప్రశంసలు**
**-కాశ్మీర్ అభివృద్ధిని కొనసాగిస్తామని ప్రకటన**

**శ్రీనగర్, మే 30 ప్రజా స్వేచ్ఛ**

పాక్‌పై ప్రతీకార దాడిలో భరాత దళాల సామర్థ్యం అభినందనీయమని, మన సత్తా ఏమిటో చాటాని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. భారత్‌పై దాడిచేస్తే ధీటుగా సమాధానం ఇస్తామన్న ప్రధాని మోడీ ప్రకటన మేరకు పాక్‌కుమన దెబ్బను చూపామని అన్నారు. పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అలాగే కాశ్మీర్‌లో చేపట్టిన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. దీనిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు.ఉగ్రదాడులతో ఆపాలనుకుంటే కఠినంగా జవాబిస్తామని హెచరించారు.ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు.



ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుందని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటు-వంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీ-వల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటు-ంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

# బ్యాంక్ మోసాలు పెరిగిపోతున్నాయి..

**మోదీని టార్గెట్ చేసిన ఖర్గే**

**న్యూఢిల్లీ మే 30 ప్రజా స్వేచ్ఛ**

గడిచిన 11 ఏళ్ల నుంచి దేశంలో బ్యాంకు మోసాలు పెరిగిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. ఫ్రాడ్, ఫేక్‌లు ప్రభుత్వం రక్తంలో ఇమిడిపోయినట్లు ఆయన ఆరోపించారు. 11 ఏళ్ల మోదీ పాలనలో సుమారు 6 లక్షల 36 వేల 992 కోట్ల మేర బ్యాంకు ఫ్రాడ్



జరిగిందని, ఆ మోసాలు 416 శాతం పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. నోట్ల రద్దు అయిన ఆరేళ్ల తర్వాత కూడా నకిలీ 500 నోట్లు చెలామణి అవుతున్నాయని, ఇది 291 శాతం పెరిగినట్లు కాంగ్రెస్ నేత ఆరోపించారు.ఈ ఏడాది నకిలీ నోట్లు మార్కెట్లోకి అత్యధిక స్థాయిలో వచ్చినట్లు ఖర్గే తెలిపారు. రక్తనాళాల్లో సింధూరం ప్రవహిస్తున్నట్లు ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. మీ రక్తనాళాల్లో ఏం ఉందో మాకు తెలియదని, కానీ మీ ప్రభుత్వ రక్తనాళాల్లో మాత్రం ఫ్రాడ్, ఫేక్ ఉన్నట్లు ఖర్గే ఆరోపించారు.

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటి పేజీ తరువాయి)

బ్రహ్మోస్ క్షిపణులు.. శత్రువులకు నిద్రలేని రాత్రులు మిగిల్చాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా బ్రహ్మోస్ క్షిపణులు మన దేశ శత్రువులకు నిద్ర లేకుండా చేశాయని ప్రధాని మోడీ అన్నారు. శుక్రవారం ప్రధాని మోడీ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మోడీ ప్రసంగిస్తూ త్రివిధ దళాలను, ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సోదరీమణుల కోపాన్ని ప్రపంచమంతా చూసిందని తెలిపారు. పాకిస్థాన్ లోపల.. వందల మైళ్ల లోపల.. వారి ఇళ్లల్లోకి చొరబడి ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసినట్లు- తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ గజగజలాడిందని.. దెబ్బతో పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చి కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేసిందని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యం పనితీరుపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేకిన్ ఇండియా శక్తిని ఇది ప్రపంచానికి చూపించింది. పాకిస్థాన్‌లో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రస్థావరాలను నాశనం చేశాం. భారత ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి శత్రువులను గడగడలాడించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాన్పుర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ఆయన.. అమేథీలోని ఏకే203 రైఫిల్ ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. భారత సైన్యం దాడులకు దిగివచ్చిన పాకిస్థాన్.. యుద్ధాన్ని ముగించాలంటూ వేడుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అణ్వాయుధ బెదిరింపులకు భారత్ బయపడదని, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోదన్నారు. పాకిస్థాన్ కుట్రలు, కుతంత్రాలు ఇక పనిచేయవని స్పష్టం చేశారు. ప్రతి ఉగ్రదాడికి తగిన సమాధానం చెప్పడమే భారత్ సిద్ధాంతమన్నారు. అందుకు సమయం, అనుసరించే విధానాన్ని సాయుధ బలగాలే నిర్ణయిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రదాడులపై భారత్ ఎప్పుడూ తీవ్రంగా స్పందిస్తుందని.. సైన్యం సమయం, ప్రణాళికలు వేసుకుని దాడి చేస్తుందని చెప్పుకొచ్చారు. ఇక అణు బెదిరింపులకు భారత్ ఎప్పుడూ భయపడదని తెలిపారు. స్వచ్ఛమైన కాన్పూర్ శైలిలో చెప్పాలంటే.. శత్రువు ఎక్కడున్నా వాళ్ల అంతు చూస్తామని మోడీ హెచ్చరించారు. కేవలం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆయుధాలనే ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించినట్లు- చెప్పారు. ప్రపంచమంతా మేక్ ఇన్ ఇండియా శక్తిని.. మన దేశీ ఆయుధాలను చూసిందన్నారు. ఇక మన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు భూభాగంలోకి ప్రవేశించి లక్ష్యాలను గుర్తించి విధ్వంసం సృష్టించిందని వెల్లడించారు. రక్షణ రంగంలోని పెద్ద కంపెనీలన్నీ ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయని.. అమేథీకి సమీపంలోనే ఏకే-203 రైఫిల్ ఉత్పత్తి ప్రారంభమైందని చెప్పారు.

# కాళేశ్వరం ప్రపంచ అద్భుతాల్లో ఒకటి

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. సదస్సులో.. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడం లో తెలంగాణ ఎందుకు ముఖ్య' అనే అంశంపై కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు.ఈ సదస్సులో వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కేంద్రంగా సాగిన పాలన, ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలుగా మారిన విధానంతో పాటు- తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కేటీఆర్ తన ప్రధానోపనాస్యంలో వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో టాప్ 5 మల్టీనేషనల్ కంపెనీల అతిపెద్ద క్యాంపస్‌లు నెలకొల్పాయి. టీఎస్ ఐపాస్‌తో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం ప్రవేశపెట్టాం. కేసీఆర్ తీసుకొచ్చిన టీ-ఎస్ ఐపాస్‌తో పెట్టు-బడులను భారీగా ఆకర్షించింది. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి విప్లవాత్మక విధానం లేదు. పదేండ్లలో 8 వేలకు పైగా అనుమతులు, రూ. 3.5 లక్షల కోట్ల పెట్టు-బడులు వచ్చాయి. తెలంగాణకు ఐటీ-కంపెనీలు తీసుకువచ్చి 10 లక్షల మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాము. మినిమమ్ గవర్నమెంట్.. మ్యాగ్జిమమ్ గవర్నెన్స్ మా విధానం. తెలంగాణలో పెట్టు-బడులు పెట్టండి. తెలంగాణలో ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించామని కేటీఆర్ గుర్తు చేశారు.దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని అన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంపద సృష్టించడంతో పాటు- సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. భారాస హయాంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, విధానాలపై తన అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని భారాస ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్నారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు- ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు- నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని తెలిపారు. ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పుకొనే చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అని వివరించారు. ప్రతి సీజన్‌కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని... అన్ని రకాల అనుమతులను తీసుకొని, నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం మూడేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో దేశంలోనే తొలిసారి కోటి ఇళ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని అందించినట్లు- వివరించారు.

# కాశ్మీర్ సమస్యను రగిల్చిందే కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. ఆనాడు ఇందిర గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీర్ ను స్వాధీనం చేసుకొని ఉంటే ఈనాడు భారత్ దేశానికి ఈ పరిస్థితి వచ్చి ఉండేదా అని నిలదీశారు. 370 ఆర్టికల్ ను రద్దుచేసి కశ్మీర్‌ని భారత దేశంలో అంతర్భాగం చేసిన ధీరుడు నరేంద్ర మోడీ అని.. మోడీ మీద విమర్శలు చేయడం సూర్యుని మీద ఉమ్మివేయడమనని తెలిపారు. ప్రపంచంలోనే నరేంద్ర మోడీ పెద్దన్న పాత్రను పోషిస్తున్నారని.. రష్యా ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆగాలని కోరుకున్న వ్యక్తి మోడీ అని కొనియాడారు. సమస్య పరిష్కరించడం ముఖ్యమని.. దేశ భద్రత పట్ల కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని దుయ్యబట్టారు. ప్రాసకోసం, రాజకీయంకోసం మీరు మాట్లాడుతున్న మాటలు సైనికుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జైహింద్ పేరుతో సైనికుల కోసమని ర్యాలీ పెట్టి రాహుల్ గాంధీని ప్రధాని చేద్దాం అంటారు.. ఏం మాట్లాడుతున్నారో సోయి ఉండే మాట్లాడుతున్నారా అని మండిపడ్డారు. ఢిల్లీలో వెళ్లి మోడీని పొగుడుతారు.. గల్లీలో వచ్చి తిడతారని విమర్శించారు.. కేంద్ర ప్రభుత్వ చేస్తున్న పనులపై మీ మంత్రులు కొనియాడతారు.. మీరేమో తిడతారు.. ఇదేనా మీ నైజం? అని తీవ్రంగా మండిపడ్డారు. మల్కాజ్గిరి ప్రజలు అప్పట్లో గుండెల్లో పెట్టుకొని గెలిపించారని అంటున్నారు. అందుకేనా వారికి గుండె కోతను మిగుల్చుతున్నారు? అని ఎద్దేవ చేశారు. అందుకేనా హైడ్రాను తీసుకువచ్చి మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న ప్రజల ఉసురు పోసుకుంటున్నారని, గుండెల్లో పెట్టుకుని.. అభిమానించినందుకేనా ఆత్మహత్యలు చేసుకొనేలా చేస్తున్నారని నిలదీశారు. రక్తాన్ని చెమటగా మలచి గెలిపిస్తే వారి రక్తాన్నే కళ్ళు చూస్తున్నారన్నారు. ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని.. మీకు ఓట్లు వేసి గెలిపించినందుకా? ప్రజల కన్నీళ్లు చూసి సంతోషపడుతున్నారన్నారు.

# కాళేశ్వరంపై మరోమారు కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ చెప్పారు కాబట్టే హరీష్, ఈటల కలిశారన్నారు. కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని మాట్లాడు కున్నారన్నారు. ఈ అంశంపై ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని వందసార్లు చెప్పామన్నారు. కవిత బీజేపీ మీద సర్జికల్ సర్జికల్ స్ట్రయిక్ చేస్తోందని.. దానిపై బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా?కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్ కు ఏటీఎంలా మారిందని ఆనాడు జేపీ నడ్డా ఆరోపించారు. ఆ ఆరోపణలను ఈటల నిజం చేస్తారా? లేక కేసీఆర్ తో ఉన్న పాత దోస్తీతో అబద్ధాలు చెప్తారా? ఈటల బీజేపీ మనిషా.. ఎవరి మనిషో విచారణ రోజు బయటపడుతుందన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల వాస్తవాలు చెప్పాలి. దొంగలుదొంగలు ఊర్లు పంచుకున్నట్లు చేశారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.భారత్- పాక్ అంశపై స్పందించారు. పాక్‌పై యుద్ధం సరిగా చేయక ట్రంప్‌కు భయపడి.. విరమించుకున్నారని ఆరోపించారు. ట్రంప్ తలదూర్చేందుకు ఎందుకు అవకాశం ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. యుద్ధంలో సాధించింది ఏంటి? కోల్పోయింది ఏంటి? చెప్పే బాధ్యత కేంద్రం మీద లేదా? అని ప్రశ్నించారు. సమాధానం చెప్పాల్సింది పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని.. ఇందిరమ్మ గొప్పతనం పార్లమెంట్ రికార్డ్స్ చూసి కిషన్ రెడ్డి మాట్లాడాలని కాంగ్రెస్ చీఫ్ మహేష్‌గౌడ్ అన్నారు. ఇందిరమ్మ అసలు సిసలైన ఉక్కుమనిషి అని కొనియాడారని... సర్జికల్ స్టయిక్ సీక్రెట్ దాన్ని కూడా బీజేపీ నాయకులు రాజకీయాల కోసం బయటకి చెప్తున్నారన్నారు.

# సైన్యం సాహసాన్ని తక్కువ చేస్తారా

(మొదటి పేజీ తరువాయి)

అంశం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది. ఉగ్రవాదులు దాడి చేస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లాగా సంతాపాలతో సరిపుచ్చుకోలేదు. పాక్ భూభాగంలోకి వెళ్లి మరీ సర్జికల్ స్ట్రయిక్ చేసింది మోదీ సర్కారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌కు ఎలా నరకం చూపించామో ప్రపంచం చూసిందని కిషన్‌రెడ్డి అన్నారు. సైన్యం విజయాన్ని రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గం అన్నారు.. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మన పాకిస్థాన్' అని అన్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మనస్సులో ఏముందో అదే బయటకు వచ్చిందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీకి ఈ జన్మలో ప్రధాని అయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. అసలు పీవోకెను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వల్లే పీవోకె అంశం ఇంకా రావణ కాష్టంగా రగులుతూనే ఉందని అన్నారు. ఉగ్రవాదులు దాడి చేస్తే.. గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లా సంతాపాలతో సరిపుచ్చుకోలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ దేశ ప్రజలు కోరుకున్నారు.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాదులకు ప్రధాని మోడీ తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను భారత సైన్యం స్పష్టంగా వివరించిందని.. ఇది ఎవరికీ తెలియకుండా జరిగింది కాదని పేర్కొన్నారు. భారత్ తమపై దాడులు చేసిందని పాక్ ప్రధాని కూడా ప్రపంచ దేశాల ముందుకు ఒప్పుకున్నారని.. కానీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, రాబర్ట్ వాద్రా ఈ విషయంలో వితండవాదం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్, రాబర్ట్ వాద్రా, రేవంత్‌రెడ్డి.. ముగ్గురూ దేశ సైనికశక్తిని తక్కువ చేసి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత సైన్యం విజయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. ఏం సాధించారని తిరంగా ర్యాలీలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. సైన్యం విజయాన్ని తిరంగా ర్యాలీ పేరుతో దేశమంతా పండుగ చేసుకుంటుంటే రేవంత్ రెడ్డికి అది బీజేపీ కార్యక్రమంగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. తిరంగా ర్యాలీలు బీజేపీ జెండాతో కాదని.. జాతీయ జెండాలతో నిర్వహిస్తున్నామని కౌంటర్ ఇచ్చారు.

# నేవీ రంగంలోకి దిగివుంటే పాక్ ముక్కలయ్యేది

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కొనియాడారు. రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నిలబడి పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ' 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కూడా యుద్ధంలో పాల్గొంది. భారత నేవీ దెబ్బకు పాక్ రెండుగా చీలిపోయింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ రంగంలోకి దిగి ఉంటే.. ఈసారి పాక్ నాలుగు ముక్కలు అయ్యేది. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ మౌనంగా తన పని చేసుకుపోయింది. ప్రతీ భారతీయుడ్ని ఆశ్చర్యపరిచింది. మౌనంగా ఉంటూనే .. పాక్ ఆర్మీని ఓడించటంలో విజయవంతం అయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ పాక్ టెర్రర్ బేస్‌లను ధ్వంసం చేసింది. అప్పుడు భారత నేవీ బలగాలు ఎంతో దూకుడుగా అరేబియా మహా సముద్రంలో మోహరించాయి. పాక్ నేవీ.. నీటి సరిహద్దులు దాటి ఇటు-వైపు రావడానికి ధైర్యం చేయలేకపోయింది. పాకిస్థాన్ చాలా అదృష్టం చేసుకుంది. ఒకవేళ ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ రంగంలోకి దిగి ఉంటే పాక్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఇప్పటి వరకూ జరిగిందంతా వామ్ అప్ మాత్రమే. ఈసారి పాకిస్థాన్ యుద్ధానికి దిగితే.. నేవీ కూడా రంగంలోకి దిగుతుంది. అప్పుడు పాక్ పరిస్థితి ఏమవుతుందో ఆ దేవుడికే తెలియాలని అన్నారు.

# ఒకే విడతలో నీట్ ప్రవేశ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వాటిపై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు ,సమయం సరిపోదంటూ ఎన్ఈబీ వినిపించిన వాదనను సుప్రీం తోసిపుచ్చింది. జూన్ 15న పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు- చేసేందుకు తగిన సమయం ఉందని వ్యాఖ్యానించింది.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ

# పర్యటన వాయిదా..!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాలపై చర్చించాలని హైకమాండ్ వారికి సూచించింది. కానీ రేవంత్ పర్యటన వాయిదా పడడంతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఆదివారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో మరిన్ని చర్చలు, సమావేశాల కోసం సోమవారం వారిని ఢిల్లీలోనే ఉండమని కోరారు. కానీ వారి అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో.. ముఖ్యమంత్రి రేవంత్ నిరాశతో హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. అయితే సీఎం, పీసీసీ ప్రెసిడెంట్ శుక్రవారం ఢిల్లీకి రావాలని ఏఐసీసీ మళ్లీ ఆదేశించింది. సీఎం మాత్రం ఢిల్లీకి వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. అయితే ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అపాయింట్‌మెంట్ ఖరారు కాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీ వెళ్లలేదని గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది.

### ఆ దయ్యాలు ఎవరో

# కవితే చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కవిత నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. కవిత నోరు విప్పాలని.. ఆమె ఏం చెబుతుందో వినాలని తాము కూడా చూస్తున్నామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌కి బీజేపీతో బంధం ఉందని కవిత స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. బీజేపీ ఎమ్మెల్యే కూడా ఈ విషయాన్ని అంగీకరించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌కు ఈడీ అంటే ఉత్సాహం ఎక్కువగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈడీ అధికారులు తన ఇంటికి ఎప్పుడూ రాలేదని... వారు తన ఇంటికి ఎందుకు రావట్లేదో.. కేటీఆర్ అడిగితే బాగుంటుందని చెప్పారు. ఢిల్లీలో బీజేపీ, బీఆర్ఎస్‌కు దోస్తానా ఉందని ఆరోపించారు. కవితనే ఆ విషయం స్వయంగా చెబుతున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం లేదని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.. కానీ అర్ధరాత్రయినా రాహుల్‌గాంధీని కలిసే చనువు రేవంత్‌రెడ్డికి ఉందని స్పష్టం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలోని భూభకాసురుల సంగతి త్వరలో తెలుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు ఎవరిని పిలవాలో తమ ప్రభుత్వం చెప్పదని తేల్చిచెప్పారు. ప్రభుత్వమే చెప్పేది ఉంటే కేసీఆర్‌నే ముందు పిలవాలని చెప్పేవాళ్లమని అన్నారు. కాళేశ్వరంలో ఎల్ అండ్ టీ- కంపెనీ కూడా ముద్దాయిగా ఉందని చెప్పారు. తప్పు చేసి దొరికి కూడా తండ్రి, కొడుకులు(కేసీఆర్, కేటీ-ఆర్) దబాయిస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తప్పుచేసిన వారిపై సీరియస్ యాక్షన్ ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణలో మూడ్రోజులు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని హెచ్చరించింది.30 నుంచి 40 కిలోమీట్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది. జూన్ రెండో తేదీన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది.

## సంపాదకీయం


# తెలంగాణ గుండెపై గులాబీ కుంపటి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా తెలంగాణ ఎప్పుడూ ఇంతగా దోపిడీకి గురికాలేదు. ఉమ్మడి ఎపిని పాలించిన నేతలు ఎప్పుడూ ఇంతగా అడ్డంగా తెలంగాణను దోచుకోలేదు. అలాగే రాష్ట్రం అప్పులపాలు కాలేదు. ఒక్క కుటుంబం గుప్పిట్లోనే అధికారం ఉండిపోలేదు. ప్రజల ధనమానప్రాణాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం చేతిలో దగాపడ్డది. దోపిడీకి గురయ్యింది. ఇది ముమ్మాటికీ నిజం. కళ్లకు కనిపిస్తున్న నిజం. తెలంగాణ కోసం రోడ్డున పడ్డ ఎందరో మోసపోయారు. ఓ కుటుంబ తెలంగాణను అప్పులపాటు చేసి, తమ బతుకుల బాగుచేసుకుని దర్జాగా వెలుగుతోంది. ఇంతగా డబ్బులు ఎక్కడివి. తెలంగాణను దోచుకున్నారని బిజెపి అంటోంది. కాంగ్రెస్ అంటోంది. కానీ దోపిడీని రుజువు చేసి ఆ కుటుంబ ఆస్తులను జప్తు చేసే కార్యక్రమం మాత్రం జరగడం లేదు. కాళేశ్వరం కెసిర్‌కు ఎటిఎం లాగా మారిందని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు పదేపదే ఆరోపించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. అంటే రాజకీయ పార్టీలన్నీ ఒక్కటే. పరస్పరం దూషించు కుంటాయే తప్ప తప్పులు చేసిన వారిని దోషిగా నిలబెట్టలేరు. కెసిఆర్ కుటుంబం ఉద్యమకారులకు ద్రోహం చేసింది. ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబాలను మోసం చేసింది. అప్పులు చేసి ప్రజలను కూడా దగా చేసింది. ఇంతగా తెలంగానను దోపిడీ చేసిన పార్టీ టిఆర్ఎస్, బిఆర్ఎస్ తప్ప మరోటి కాదు. ఇప్పుడు ఆ పార్టీలో అధికారం కోసం లేదా పెత్తనం కోసం జరుగుతున్న పోరాటమే కవిత తిరుగుబాటు తప్ప మరోటి కాదు. ఇది ఏమాత్రం ప్రజలకు సంబంధం లేనిది. ఇకపోతే సొంత ఇల్లునే చక్కబెట్టుకోలేని కెసిఆర్ గత పదేళ్లుగా తెలంగాణను ఎలా పాలించారో తెలుసు కోవచ్చు. ఆయన ఓ అసమర్థ నేత అని అప్పుడూ.. ఇప్పుడూ రుజువు అవుతోంది. సిఎంగా కెసిఆర్ ప్రజలను ఎందుకు కలవాలని, తండ్రిని ఇంట్లోనే మూలన కూర్చుండబెట్టిన కెటిఆర్ పెత్తనం చేసేందుకు చేసిన ప్రయత్నాలే ఇప్పుడు పంచాయితీకి కారణమని భావించాలి. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ గుప్పిట్లో పెట్టుకున్న కారణంగానే సహించలేక సోదరి కవిత తిరుగబాటు ప్రకటించింది. ఇక్కడ తనకూ కొంత పెత్తనం దక్కక పోవడంతో పాటు, ఉమ్మడి ఆస్తుల విషయంలోనూ పంచాయితీ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఎన్నికల్లో అధికారం కోల్పోయాక అసెంబ్లీకి రాకుండా, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా కెసిఆర్ చేసిన తప్పిదం వల్ల కెటిఆర్ చెలరేగి పోతున్నారు. ఇప్పుడు ఆయన కెసిఆర్ నాయకత్వాన్ని సవాల్ చేసే విధంగా తనకు అనుకూలంగా కోటరీని మలచుకున్నారు. పార్టీని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. హరీష్ రావును దూరం పెట్టారు. ఇదో రకంగా కెసిఆర్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని కవిత ఇప్పుడు చెప్పడం కాదు..ఎప్పుడో జరిగింది. బిఆర్ఎస్ కోసమే ఎంపి ఎన్నికల్లో సైలెంట్ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కేసుల భయంతోనే ఇదంతా చేస్తున్నారని ప్రజలు ఎప్పుడో గమనించారు. లిక్కర్ కేసులో అడ్డంగా బుక్కయిన కవిత ఇప్పుడు నీతులు మాట్లాడితే ప్రజలు నమ్మరు. ఈ కుటుంబంలో అందరూ అవినీతిపరులే అనడానికి ఎలాంటి సందేహం అక్కర్లేదు. తమ కులం వారికే పదవులు కట్టబెట్టడం, తెలంగాణతో సంబంధం లేని వారికి అధికారాలు కట్టబెట్టడం,కాంట్రాక్టులు కట్టబెట్టడం, తెలంగాణ పోరాటం చేసిన వారిని దూరం పెట్టడం అన్నీ ఓ క్రమపద్దతిలో తమ దోపిడీకి అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలే అని చెప్పకతప్పదు. జయశంకర్ సార్ నుంచి కోదండరామ్ సార్ వరకు అందరూ దగాపడ్డవారే. ఎందుకంటే బిఆర్ఎస్ అన్నది కేవలం ముగ్గురు వ్యక్తుల ఆధిపత్యంలో నడిచింది. కెసిఆర్, కెటిఆర్, కవితలే దానికి బాస్‌లు. మిగీ ఎవరున్నా వారంతా పైకి కనిపించే దమ్మీలే. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచేకుట్ర జరుగుతోందని కవిత అంటున్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిన వారికి కటుఉంబంలో కూడా వెన్నుపోట్లు పొడవడానికి వెరవరని కవిత వ్యాఖ్యలే చెబుతున్నాయి. తెలంగాణను అడ్డంగా నిలువునా దోచుకున్న తరవాత ఇప్పుడు కవిత సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానని అంటే నమ్మడానికి తెలగాణ ప్రజలు సిద్దంగా లేరని గుర్తించడం మంచిది. దోచుకుంది చాలు. ఇక సొంత రాజకీయాలు తేల్చుకుని తెలంగాణను ప్రశాంతంగా బతకనీయాలి. ఎందుకంటే కెసిఆర్ కుటుంబం చేసిన అప్పుల కారణంగా తెలంగాణ వందేళ్లు వెనక్కి పోయింది. బంగారు తెలంగాణ అంటూ కెసిఆర్ తన కుటుంబాన్ని 24 క్యారట్ల గోల్డ్‌గా మార్చుకున్నారు. ఈ క్రమంలో తాజా ఎపిసోడ్ అన్నది కేవలం అధికారం కోసం రాజకుటుంబంలోజరిగే పోరాటం లాంటిదే. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని చెప్పక తప్పదు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు వారు తెగగబడతారని కూడా అనుకోవాలి. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారు. అందులో కవిత పాత్ర కూడా ఉంది. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్ళది. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి కెసిఆర్. అలాంటి కెసిఆర్ తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని రుజువు అయ్యింది. కాళేశ్వరం లాంటి పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. తేల్చేసారు. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకోవడానికి వెనకాడరని కవిత రుజువు చేశారు. అందుకే కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నది నూటికినూరుపాళ్లు నిజం. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన వేలమంది గొంతులు తడిగుడ్డతో కోసిన చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిది. అధికారం కోసం మాత్రమే వీరు రాజకీయం చేస్తున్నారు.కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని తేలింది. కాంగ్రెస్ విఫలం అయితే...ప్రజలు మరో ప్రత్యామ్నాయం చూసుకుంటారే తప్ప కెసిఆర్‌ను, ఆయన కుటుబాన్ని మాత్రం ఇక నమ్మరు.

# రాష్ట్రావతరణ వేడుకల్లో జెండావిష్కరించేది వీరే







తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్, మే 30 ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా జిల్లాల్లో జాతీయ జెండా ఆవిష్కరించే వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఏ జిల్లాల్లో ఎవరు జెండా ఆవిష్కరించనున్నారో వారి వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వికారాబాద్‌లో స్పీకర్ గడ్డంప్రసాద్‌కుమార్ రాష్ట్రావతరణ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - ఖమ్మం, మంత్రుల్లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి - వరంగల్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి - సూర్యాపేట, పొన్నం ప్రభాకర్ -సిద్దిపేట, దామోదర రాజనర్సింహ -సంగారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి - నల్లగొండ, ధనసరి అనసూయ సీతక్క -ములుగు, జూపల్లి కృష్ణారావు -మహబూబ్‌నగర్, శ్రీధర్‌బాబు - కరీంనగర్, కొండా సురేఖ- హనుమకొండ, తుమ్మల నాగేశ్వర్‌రావు - భద్రాద్రికొత్తగూడెంలో జాతీయజెండాలను ఆవిష్కరిస్తారు. ఇతర జిల్లాల్లో ప్రభుత్వ విప్‌లు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం వెల్లడించింది.

# కవిత లేఖతో గులాబీ, కమలం బంధమేంటో తేలింది

-రాజాసింగ్ విమర్శలకు కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి
-డబ్బుల కోసమే కేసీఆర్ కుటుంబంలో కొట్లాట
- కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలను కలిపిన 'నోటీసులు'
- రహస్య సమావేశాలతో మళ్లీ చిగురించిన బంధం
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్‌మే 30 ప్రజా స్వేచ్ఛ**

బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు చర్చలు జరిపింది వాస్తవమేనని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పే దమ్ముందా?అని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాజాసింగ్ వ్యాఖ్యలను పోల్చి చూస్తే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యమని చెప్పారు. కేసీఆర్, కిషన్‌రెడ్డి కలవడం వల్లే బండి సంజరును అధ్యక్ష పదవి నుంచి తొలగించారని రాజాసింగ్ పరోక్షంగా చెబుతున్నారని అన్నారు. ఆయన లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పకుండా రాహుల్ గాంధీపై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై అవాకులు, చెవాకులు మాట్లాడుతున్న బీజేపీ నేతలను తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. సైనికులకు బాసటగా రాహుల్‌గాంధీ నిలిస్తే విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. బీజేపీ నేతల దిగజారుడు తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మునిగిపోయిన నావ అని అన్నారు. ఆ నావలో ఉన్న వస్తువుల (డబ్బుల) కోసం మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణలో ఎనిమిది సీట్లు ఉన్న బీజేపీతో కలిస్తే బీఆర్ఎస్ ఎనిమిది స్థానాలకు పరిమితమవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబంలో వాటాల కోసం పంచాయితీ మొదలైందని అన్నారు. నోటీసులు రాగానే కేసీఆర్, ఈటల రాజేందర్‌కు పాత బంధం మళ్లీ చిగురించిందని ఎద్దేవా చేశారు. కుల సర్వే బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని చెప్పారు. కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్‌తో సమావేశం అయ్యారని ఆరోపించారు. హరీశ్‌రావుతో కలిసి ఈటల కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. కవిత లేఖ లీక్ వెనక ఆమె ప్రమేయం ఉండొచ్చు లేదా కేసీఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండొచ్చు అని వ్యాఖ్యానించారు. రాజాసింగ్, కవిత వ్యాఖ్యలతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం గుట్టు వీడిందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ మైత్రి గురించి కవిత చెప్పకనే చెబుతున్నారని తెలిపారు.






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# హర్యానా సీఎం ఇళ్లు, సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు



**చండీఘడ్ మే 30 ప్రజా స్వేచ్ఛ**

హర్యానా సీఎం నయాబ్ సైనీ ఇంటితో పాటు ఆ రాష్ట్ర సెక్రటేరియేట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సూసైడ్ దాడి జరగవచ్చు అని ఆ ఈమెయిల్‌లో బెదిరించారు. ఆఫీసులో బాంబు ఉన్నట్లు మధ్యాహ్నం 3.15 నిమిషాలకు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. హర్యానా సీఐడీ బాంబు బెదిరింపు గురించి అప్రమత్తం చేసింది. సీఐఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసులు.. తక్షణ చర్యలు తీసుకుని, అక్కడ ఉన్న సిబ్బందిని తరలించారని చండీఘడ్ ఎస్పీ ఉదయ్‌పాల్ సింగ్ తెలిపారు. అలర్ట్ రాగానే బాంబు డిస్పోజల్ స్క్వాడ్, ఫైర్ బ్రిగేడ్, అంబులెన్స్, క్విక్ రియాక్ట్ టీమ్స్, డాగ్ స్క్వాడ్ సెక్రటేరియేట్‌కు చేరుకున్నాయి. సీఎం నివాసంతో పాటు సెక్రటేరియేట్ వద్ద భద్రతను పెంచారు. బిల్డింగ్‌లతో పాటు సమీప ప్రాంతాల్లో జాగిలాల బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. హర్యానా సీఎం నివాసాన్ని సంత్ కబీర్ కుటీర్ అని పిలుస్తారు. సంత్ కబీర్ కుటీర్‌తో పాటు సెక్రటేరియట్ చండీఘడ్‌లోనే ఉన్నాయి.

# రాజ్యసభ సభ్యులకు స్మార్ట్ టీవీలు, ప్రొజెక్టర్లు

-అందజేయనున్న కేంద్రం



**న్యూఢిల్లీ మే 30 ప్రజా స్వేచ్ఛ**

రాజ్యసభ సభ్యులకు కేంద్రం త్వరలోనే ఆధునిక గ్యాడ్జెట్లను ఉచితంగా అందజేయనుంది. తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా వారికి స్మార్ట్ టీవీలు, స్మార్ట్ ప్రొజెక్టర్లు, ఇతర వేరబుల్ గ్యాడ్జెట్లను అందజేస్తారు. రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మూడేండ్లకు పైగా ఉంటే వారికి రూ.2 లక్షలు.. మూడేండ్లు, అంతకన్నా తక్కువ పదవీ కాలానికి ఉప ఎన్నిక ద్వారా ఎన్నికైన సభ్యులకు రూ.1.5 లక్షలు ఇస్తారు.మూడేండ్ల కన్నా అదనంగా పదవీ కాలం ఉన్న వారికి అదనంగా రూ.లక్ష కేటాయిస్తారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యులు డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్,

# నిబంధనల మేరకే ఇండ్లు నిర్మించాలి

**-బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**- హుస్నాబాద్‌లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేత**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హుస్నాబాద్ మే 30 ప్రజా స్వేచ్ఛ**
ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో హుస్నాబాద్ మండలానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లలో హుస్నాబాద్ మండలానికి 40 ఇండ్లు మాత్రమే ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు ఏడాదికి 200 ఇండ్ల చొప్పున నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. పునాదులు పెద్దగా వేస్తే పైసలు రావని.. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇండ్లు నిర్మించాలన్నారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒకవేళ అనర్హులకు ఇల్లు మంజూరైతే వాటిని రద్దుచేస్తామని చెప్పారు. లబ్దిదారులకు ఫ్రీ ఇసుక ట్రాక్టర్ కూపన్లు వస్తాయన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ పని కింద మరుగుదొడ్లు కూడా నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇంకుడు గుంతలకు కూడా డబ్బులు ఇస్తారన్నారు. ఇండ్ల నిర్మాణానికి డబ్బులు కావాలని అనుకుంటే మహిళా సంఘాల నుంచి లక్ష రూపాయలు రుణం ఇస్తున్నట్టు చెప్పారు. ప్రజా సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామన్నారు. హుస్నాబాద్ నియోజవర్గం మొత్తంలో డబుల్ రోడ్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెదక్ ఎంపీ రఘునాథరావు రాక..



**మెదక్ జిల్లా-మే మే 30 ప్రజా స్వేచ్ఛ**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మరియు కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి పిలుపు మేరకు మెదక్ జిల్లా బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు పుణ్యశ్లోక, లోకమాత, రాణి అహల్యబాయ్ హెూల్కర్ 300వ జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా రానున్నారన్నారు.కావున రాష్ట్ర, జిల్లా మరియు మండల స్థాయి ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు,శక్తి కేంద్రం ఇంచార్జులు, బూత్ అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా బి జె పి జిల్లా ప్రధాన కార్యదర్శి యం ఎల్ ఎన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు



**మహమ్మదాబాద్ మే 30 ప్రజా స్వేచ్ఛ**
మహబూబ్ నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే ఎం నారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని నంచర్ల, దేశాయిపల్లి, చౌదర్ పల్లి, పెద్ద తాండా, సంగయపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళకి ముగ్గు వేసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇడ్లను అందజేస్తుందని కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇల్లు ఎందరో పేదలకు నిర్మించి ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో. హౌసింగ్ ఏ ఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, యూత్ అధ్యక్షులు మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# వికసిత కృషి సంకల్ప అభియాన్

**-రైతులకు ఆధునిక వ్యవసాయ మార్గదర్శకం**



**మాడుగుల, మే 30 ప్రజా స్వేచ్ఛ**
కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా మరియు కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త అధ్వర్యంలో మడుగుల్ గ్రామ రైతు వేదికలో "వికసిత కృషి సంకల్ప అభియాన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతికత, నూతన రకాల పంటల విధానాలు, అధిక లాభం అందించే ఉద్యాన పంటల సాగు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం ఎలా అభివృద్ధి చెందుతుందో రైతులకు వివరించారు. ముఖ్యంగా, రైతులు తమ పొలంలో మట్టిని పరీక్షించి, అందులోని పోషక విలువలను అంచనా వేసుకొని సమతుల్య ఎరువులను ఎలా వినియోగించుకోవాలో శాస్త్రీయంగా తెలియజేశారు. వ్యవసాయంలో పశుపోషణకు విశేష ప్రాముఖ్యత ఉన్నందున, పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ విధానాలు, వివిధ రకాల గడ్డి జాతుల పోషక విలువలు వంటి అంశాలను శాస్త్రవేత్తలు సవివరంగా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించి, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో మార్గనిర్దేశం చేశారు. కేంద్ర మట్ట పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డా. నాగార్జున కుమార్, డా. భార్గవి, డా. ప్రియా, డా. సుధీర్, డా. విజయకుమార్, డా. శ్రీకృష్ణ, డా. దిలీప్ శ్రాస్తవ్ హాజరై, సమగ్రంగా వివరణ ఇచ్చారు. అలాగే, వ్యవసాయ అధికారి శ్రీమతి అరుణ కుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీమతి జ్యోత్స్న, దుర్గా ప్రసన్న, భార్గవి, ప్రియాంక, నవ్య, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొని రైతులకు కీలక అంశాలను అందించారు.

## అంతక్రియలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**పాపన్నపేట మే 30 ప్రజా స్వేచ్ఛ**
పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల, పెద్దన్న గారి శశిధర్ రెడ్డి, గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈట్టి విషయం మండల నాయకుల ద్వారా తెలుసుకున్న మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, శుక్రవారం యూసుఫ్‌పేట గ్రామనికి చేరుకొని శశిధర్ రెడ్డి,అంతక్రియలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్, నాయకులు శ్రీనివాస్ రావు, గోపాల్,అశోక్,ఉమా మహేశ్వర్, వెంకొబా, తదితరులు నాయకులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరిని ఒప్పించే పని చేస్తాం

**-రోడ్డు బాధితులకు తగిన న్యాయం చేస్తాం - ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**వనపర్తి,మే 30 ప్రజా స్వేచ్ఛ**
వనపర్తి పట్టణ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరణకు సహకరించాలని స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి కోరారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న వ్యాపార సంస్థల యజమానులతో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి నిర్వహించిన సమావేశానికి శాసన సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో వ్యాపార సముదాయాలు, ఇల్లు కోల్పోయే ప్రతి ఒక్కరికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అందరిని ఒప్పించే పని చేస్తామని పేర్కొన్నారు వనపర్తి పట్టణం నుంచి పెబ్బేరు రహదారి, పానగల్ రహదారి విస్తరణకు సంబంధించి వ్యాపారస్తులను ఇళ్ల యజమానులను ఇబ్బంది పెట్టి రోడ్డు విస్తరణ చేపట్టదలుచుకోలేదని, రోడ్డు విస్తరణను యజమానులను ఒప్పించి తగిన నష్ట పరిహారం ఇచ్చి విస్తరణ మాత్రం తప్పకుండా జరుగుతుందన్నారూ పానగల్ రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్ రూమ్ కేటాయించడం లేదా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం వంటి సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు పట్టణంలోని ప్రధాన రహదారి వనపర్తి - పెబ్బేరు రోడ్డు విస్తరణ అనేది భావి తరాలకు, వనపర్తి గౌరవాన్ని కాపాడటానికి చాలా ముఖ్యమని అందువల్ల వ్యాపారస్తులు రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. వనపర్తికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఎక్కడ లేనివిధంగా సైఫాన్ డ్యామ్, చారిత్రాత్మక పాలిటెక్నిక్ కళాశాల ఇక్కడే ఉన్నాయన్నారు.

రోడ్డు ఎన్ని ఫీట్లలో ఉండాలి అనేది ఇప్పటికే టౌన్ ప్లానింగ్ ద్వారా రూపొందించిన ప్రణాళికకు అనుగుణంగా ఒకటి రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్ తో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.రోడ్డు ఒకే ప్లాట్ ఫాం పద్ధతిలో వంకరలు లేకుండా అలన్మెంట్ ఉంటుందన్నారు. వనపర్తి పట్టణానికి 2000 సంవత్సరంలోనే ప్లాన్ తయారు చేసి 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదించడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణ ప్రజలకు చాలా అవసరమని, విస్తరణ వల్ల ఎక్కువ లాభం రోడ్డు పక్కన ఉన్న వ్యాపారస్తులకు కలుగుతుందన్నారు.


కొంత స్థలం కోల్పోతున్న వారికి టి.డి.ఆర్ ఇవ్వడం, పూర్తిగా స్థలం కోల్పోయే వారికి నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న వారికి ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం టి.డి.ఆర్ తీసుకోవడం చాలా లాభదాయకమని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.భవిష్యత్తులో డెవలపర్స్ కు అమ్ముకొని నాలుగింతల లాభం పొందవచ్చు అన్నారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న యజమానులు వారి వాదనలు, అభ్యర్థనలు తెలిపారు.ముందుగా రోడ్డు మధ్యభాగం ఎక్కడి నుంచి కొలతలు చేస్తారో నిర్ణయించాలని అదేవిధంగా రోడ్డు విస్తరణ వంద ఫీట్లు కాకుండా 70 నుంచి 80 ఫీట్ల కు కుదించాలని కోరారు. వ్యాపారస్తుల తరపున అడ్వకేట్ నిరంజన్ పాషా తమ వాదనలు వినిపించారు.లిబి కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకం పై ఎం ఎల్ ఎ వివేక్ సమీక్ష.



**మే 30 ప్రజా స్వేచ్ఛ భీమారం మండల ప్రతినిధి.**
భీమారం మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక ఎం ఎల్ ఎ వివేక్ వెంకటస్వామి పర్యటించారు. పలు కార్యకర్తలను, ప్రజా ప్రతినిధులను ఊరి ప్రజలను కలిసి ఊరి సమస్యల గురించి చర్చించారు. అదే విధంగా ప్రజలకు అందవలసిన ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రాజీవ్ యువ వికాస పథకం లో అర్హులైన ప్రతి ఒక్కరికీ అంటే సిబిల్ స్కోర్ ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతుందని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియూ గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కొమ్ము సురేష్



**మే 30 ప్రజా స్వేచ్ఛ కొత్తకోట ప్రతినిధి**
కొత్తకోట మండలం, రామకృష్ణాపురం గ్రామంలో, భారతీయ జనతా పార్టీ (251) బూత్ అధ్యక్షుడు మొగిలి గారి తమ్ముడు విష్ణు-శిరీష వివాహ వేడుకలో బిజెపి పార్టీ మండల సీనియర్ నాయకులు కొమ్ము సురేష్,నూతన వధూవరులకు అక్షింతలు వేసి,నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారుఈ కార్యక్రమంలో కొమ్ము సురేష్,నితిన్ కుమార్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్ ను సందర్శించిన సీపీ



**మే 30 ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా రాచకొండ కమిషనర్ జి.సుదీర్ బాబు, ఆదేశాల మేరకు రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఘట్కేసర్ అవుషాపూర్ కేపాల్ బస్ స్టాండ్ దగ్గర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును ఏర్పాటు చేయడం జరిగింది.శుక్రవారం ఇంచార్జ్ డీసీపీ అరవింద్ బాబు మరియు మల్కాజ్గిరి ఏసీపీ చక్రపాణి సందర్శించి పోలీస్ సిబ్బందికి నిర్వహిస్తున్న చెక్ పోస్ట్ దగ్గర పాటించాల్సిన జాగ్రత్తలు,అక్రమంగా తరలిస్తున్న గోవులపై నిఘా ఉంచాలని సూచించడం జరిగింది.

# ప్రతాప్ సింగారం గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ల లొల్లి



**మే 30 ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ ప్రతాపసింగారంలో డబుల్ బెడ్ రూమ్ ల లొల్లి బజారు ఎక్కింది రాజకీయ నాయకుల స్వలాభం కోసం పేద ప్రజల కుటుంబాలకు శాపంగా మారింది ప్రతాప్ సింగారం డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు స్థానికులకు రాలేదని కొంత మంది కుటుంబాలకు లిస్ట్ లో పేరు రాలేదని ప్రతాప్ సింగారం కమ్యూనిటీ ఆవరణలో బాధితులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీలో ఉంటూ ప్రతాపసింగారం గ్రామంగా ఉన్న సమయంలో వార్డు మెంబర్ గా ఉన్న వ్యక్తులు ఇల్లు ఉన్న డబుల్ బెడ్ రూమ్స్ ఇల్లులు కొందరు తీసుకున్నారు ఏకపక్షంగా బిఆర్ఎస్ పార్టీ వాళ్లు చాలా మంది ఇల్లు ఉండి తీసుకున్నారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హయాంలో మలిపెద్ది సుదీర్ రెడ్డి ద్వారా ఇల్లు లేని ప్రతాపసింగారం చెందిన వారికి ఇంటి లిస్ట్ లో పేరు వస్తే కుట్రలు పన్నుతూ, ఇల్లు లేని నిరుపేదల లబ్ధిని అడ్డుకునే పనిచేస్తునారు రాజకీయ స్వలాభం కోసం నిరుపేదల ఇండ్ల కలలను నీళ్లు చల్లోద్దని కోరుతున్నారు.

# రాష్ట్రపతి అవార్డు గుండేటి యోగేశ్వర్ కు ఘన సన్మానం..

**కరీంనగర్, మే 30 ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పర్యావరణవేత్త, అంతర్జాతీయ జీవవైద్య సదస్సు అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం(నీరు చెట్టు నేల) వాల్టా అక్ట్ అథారిటీ రాష్ట్ర సభ్యుడు గుండేటి యోగేశ్వర్ ను సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ గద్దె రవికుమార్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు బూట్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్, బూట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గుండెటి యోగేశ్వర్ కవి, రచయిత, వ్యాఖ్యాత, బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రకృతి ప్రేమికుడు రచయిత కవిగా అమూల్యమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి ప్రతిభను భారత ప్రభుత్వం గుర్తించి అప్పటి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ గోవింద్ గారి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారనీ గుర్తు చేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ ను తాము కలవడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా చిరు సత్కారం చేయడం మర్చిపోలేని అనుభూతి కలిగించిందని వారు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయన ప్రజలకు మరింత సేవలు అందించి గొప్ప పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

# సమాచార హక్కు చట్టం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

-వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం.
-హాజరైన ఆర్టీఐ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్



**మే 30 ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**
ప్రతి ఒక్క పౌరుడు సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగి ఉండాలని ఆర్టీఐ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ అన్నారు.మే 30 శుక్రవారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి అంతమొందించి పాలనలో జవాబుదారీతనం,పారదర్శకంగా అమలు జరగాలని ఇలాంటి చట్టాలు అమలు చేయబడ్డాయని అన్నారు.ప్రతి పౌరుడు చట్టం పై అవగాహన పెంచుకుని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.వనపర్తి జిల్లా అధ్యక్షులు రవి కుమార్ కి,కమిటీ సభ్యులకి నియమాల పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ కి జిల్లా కమిటీ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు మంగరాయి వెంకటేష్,జిల్లా కమిటీ సభ్యులు బాజ శేఖర్,అడ్డాకుల మండల ప్రధాన కార్యదర్శి మామిళ్ళ శ్రీనివాస్,పెబ్బర్ మండల అధ్యక్షులు శివరాజ్,మధనపురం మండల అధ్యక్షులు కావలి అశోక్ కుమార్,శ్రీరంగపురం మండల అధ్యక్షులు మేకల అశోక్, పెద్దమందడి మండల అధ్యక్షులు నక్క కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం


-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
-మొదటి విడతలో 2047 మంది లబ్ధిదారులకు ఇళ్ళ మంజూరు నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇళ్ల మంజూరు
-లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి



**మే 30 ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**
రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారుపటాన్చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుడి గృహ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా అర్హులకే వీటిని కేటాయించడం జరిగిందని స్పష్టం చేశారు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. మొదటి విడతలో 2047 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరయ్యాయని తెలిపారు.ఇళ్ల నిర్మాణ దశకు అనుగుణంగా నిధులు విడుదల అవుతాయని తెలిపారు. చిన్న కంజర్ల గ్రామంలో 65 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరయ్యాయని తెలిపారుఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి, గృహ నిర్మాణ శాఖ డిఈ రవీందర్, గ్రామీణ నీటిపారుల శాఖ డిఈ శ్రీనివాస్,గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి,మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ,సాయిబాబా ,అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా బాలగౌని బాలరాజ్ గౌడ్

-ట్రస్ట్ యొక్క నూతన కమిటీ
-సమాజసేవే వీరి లక్ష్యం
-ట్రస్ట్ నూతన చైర్మన్ గా బాలగౌని బాలరాజు గౌడ్





**మే 30 ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపల్ పరిది లోని అన్నోజిగూడలో కొలువైన శ్రీ ఆంజనేయ, సాయిబాబా,అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్ట్ నూతన చైర్మన్ గా బాలగౌని బాలరాజు గౌడ్ జనరల్ సెక్రటరీగా బాలగౌని వెంకటేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ ఆంజనేయ,సాయి బాబా, అయ్యప్ప స్వామి దేవాలయం ఘట్కేసర్ అన్నోజిగూడ ప్రజలను కాపాడుతున్నారని చైర్మన్ బాలరాజు గౌడ్ అన్నారు. అలాంటి భగవంతుడి సేవలు ట్రస్ట్ గా మారి మునుముందు ప్రజలను భగవంతుడినీ మరింత దగ్గర చేసేందుకే ట్రస్ట్ గా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ (శ్రీ ఆంజనేయ స్వామి సాయిబాబా అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్ట్) లో 9 మంది సభ్యులుగాను చైర్మన్, వైస్ చైర్మన్, సెక్రటరీ, ట్రెజరర్, జాయింట్ సెక్రెటరీలుగా రెండు సంవత్సరాల వరకు విధులు నిర్వహిస్తారు.

-ఈ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు విద్య వైద్యం అందించాలని అలాగే వృద్ధాప్యంలో రోడ్డున పడ్డ వృద్ధులకు తోడుగా నీడగా ఉండాలని చిన్ని ప్రయతం.

-హిందూ బంధువులందరికీ సనాతన ధర్మం, ఉపనయనాలు,వేద గ్రంధాలు,ఆధ్యాత్మిక పుస్తకాలు ట్రస్టులో అందుబాటులోకి తీసుకొచ్చి మన పురాతన ధర్మం పై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

-సామాజిక ఆధ్యాత్మిక మరియు పురాతన వైద్య విధానాలపై యువతకి అవగాహన కల్పిస్తూ సమాజంలో మార్పు తేవడానికి ఈ ట్రస్ట్ (శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం చారిటబుల్ ట్రస్ట్) దోహదపడేలా చూస్తామన్నారు.

-ట్రస్ట్ ఆదాయాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవాలయం యొక్క మరమ్మతులు అభివృద్ధి పనులు అలానే సమాజంలో భగవంతుడిపై సమాజంపై ప్రేమాభిమానాలను నింపుతూ మంచి బాటలో ఆధ్యాత్మికతతో నడిచే విధంగా సమాజాన్ని నడిపిస్తూ అభివృద్ధి పనులలో ముందుంటారని తెలియజేశారు.

# బిజినెస్

# దిగివస్తున్న బంగారం ధరలు..! 2 రోజుల్లో ఎంత తగ్గిందంటే..

**మే30 ప్రజా స్వేచ్ఛ**

పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో ఒక్కోసారి ధరలు పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి.. గత నెల లక్ష మార్కు దాటిన పసిడి ధరలు.. ఆ తర్వాత తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి.. ఇటీవల 95వేల వరకు దిగొచ్చిన పసిడి ధరలు.. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే 98వేల వరకు చేరుకున్నాయి.. తాజాగా బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. మే 30 2025 శుక్రవారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 97,030 ఉండగా.. 22 క్యారెట్ల ధర 88,940 లుగా ఉంది.. రెండు రోజుల్లోనే పది గ్రాములపై రూ.800 మేర ధర తగ్గింది. వెండి కిలో ధర రూ.100



తగ్గి.. రూ.99,800 లుగా ఉంది.బంగారం, వెండి ధరలు..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,030గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.88,940లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,10,800లుగా ఉంది.

-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.97,030గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.88,940లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,10,800 లుగా ఉంది.

-ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.97,180గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.89,090లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.99,800లుగా ఉంది.

-ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.97,030, 22 క్యారెట్ల ధర రూ.88,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.99,800లుగా ఉంది.

-చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.97,030, 22 క్యారెట్ల ధర రూ.88,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,10,800లుగా ఉంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.97,030, 22 క్యారెట్ల ధర రూ.88,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.99,800లుగా ఉంది.

## దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ప్రారంభం



**మే 30 ప్రజా స్వేచ్ఛ**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను అమెరికా ఫెడరల్ కోర్టు నిలిపివేయడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో పరుగులు పెట్టిన సూచీలు నేడు తిరిగి నష్టాల్లోకి జారుకున్నాయి. తొలుత నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ప్రస్తుతం ఫ్లాట్‌గా ట్రేడవుతున్నాయి. ఉదయం 9 గంటల 25 నిముషాలకు సెన్సెక్స్ 27 పాయింట్ల లాభంతో 81,660 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 19 పాయింట్ల లాభంతో 24,852 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో.. అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ, ఎటర్నల్, సన్‌ఫార్మా, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్‌ఎం, టాటా స్టీల్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.84 డాలర్ల వద్ద.. బంగారం ఔన్సు 3,299 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500.. 0.40 శాతం, నాస్‌డాక్ 0.39 శాతం, డోజోన్స్ 0.28 శాతం లాభపడ్డాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు బలహీనంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ 1.41 శాతం, హాంగ్‌సెంగ్ 1.49 శాతం, షాంఘై 0.28 శాతం నష్టంతో కదలాడుతున్నాయి. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ మాత్రం ఫ్లాట్‌గా ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.884 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా..

## టీవీఎస్ నుంచి మరో స్కూటర్.. జూపిటర్ 125.. స్మార్ట్ ఫీచర్స్.. ధర ఎంతో తెలుసా?

**మే 30 ప్రజా స్వేచ్ఛ**

టీవీఎస్ మోటార్ కంపెనీ ఇటీవల సోషల్ మీడియాలో చాలా కార్యాచరణను ప్రదర్శించింది. ఆ కంపెనీ తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ఒకదాని తర్వాత ఒకటిగా అనేక టీజర్‌లను విడుదల చేసింది. దీనిలో జూపిటర్ 125 కొత్త వెర్షన్ ఉంది. ఈ టీజర్ల శ్రేణి ఇప్పుడు జూపిటర్ 125 కొత్త వేరియంట్ DT SXC విడుదలతో ముగిసింది. ఆ కంపెనీ తన బెస్ట్ సెల్లింగ్ స్కూటర్ 'టీవీఎస్ జూపిటర్ 125'లో కొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కొత్త వేరియంట్‌లో కొన్ని ప్రత్యేక ఫీచర్లను చేర్చింది. దీని ప్రారంభ ధర రూ. 88,942 (ఎక్స్-షోరూమ్). జూపిటర్ 125 DT SXC లో ప్రత్యేకత ఏమిటి?: అయితే, లుక్, డిజైన్ పరంగా ఈ స్కూటర్ ఇతర వేరియంట్లలో చాలా వరకు పోలి ఉంటుంది.



కానీ మిగిలిన వాటి నుండి దీనిని వేరు చేసే కొన్ని అద్భుతమైన అప్‌డేట్‌లు ఉన్నాయి. ఇది రెండు కొత్త డ్యూయల్-టోన్ రంగుల ఎంపికను కలిగి ఉంది. వీటిలో ఐవరీ బ్రౌన్, ఐవరీ గ్రే రంగులు ఉన్నాయి. దీనితో పాటు కంపెనీ ఫ్లాట్ సింగిల్-పీస్ సీటు మాదిరిగానే డ్యూయల్-టోన్ ఇన్నర్ ప్యానెల్‌లను కూడా జోడించింది. దగ్గరగా పరిశీలిస్తే, దీనికి 3D చిహ్నం, బాడీ-రంగు గ్రాబ్ రైల్ కూడా లభిస్తుంది. ఈ కొత్త వేరియంట్ ధర మిడ్-స్పెక్ డిస్క్ వేరియంట్ కంటే రూ. 3,500 ఎక్కువ, కొత్త ఫీచర్లతో వస్తుంది. ఇది బ్లూటూత్ కనెక్టివిటీతో వచ్చే కలర్ LCD డిస్‌ప్లే ఉంటుంది. దీనితో పాటు, టర్న్-బై-టర్న్ నావిగేషన్ సౌకర్యం కూడా ఇందులో అందుబాటులో ఉంది. ఈ కొత్త వేరియంట్ విడుదలతో, జూపిటర్ ఇప్పుడు మొత్తం నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. దీని బేస్ వేరియంట్ ధర రూ. 80,740 నుండి ప్రారంభమై టాప్ వేరియంట్ స్మార్ట్ కనెక్ట్ ధర రూ. 92,001 (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది. టీవీఎస్ జూపిటర్ 125 లో కంపెనీ 124.8 సిసి సామర్థ్యం గల సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను ఇచ్చింది. ఇది 8 HP పవర్, 11 Nm పీక్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్ నిరంతర వేరియబుల్ ట్రాన్స్మిషన్ (CVT) కి జతచేయబడి ఉంటుంది.

# స్పోర్ట్స్

## క్వాలిఫయర్-2కు ముంబై.. పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్..

**మే 30 ప్రజా స్వేచ్ఛ**

కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై విజయం సాధించింది. ముల్లాన్‌పూర్‌లో పరుగుల వరద పారిన మ్యాచ్‌లో ముంబైది పైచేయిగా నిలిచింది. టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించిన గుజరాత్ టైటాన్స్ పోరాడి ఓటమిపాలైంది. భారీ స్కోరింగ్ గేమ్‌లో 20 పరుగుల తేడాతో ఓడిపోయింది. ముల్లాన్‌పూర్ స్టేడియంలో ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన ముంబై ఇండియన్స్ ఆదివారం పంజాబ్ కింగ్స్‌తో జరగబోయే క్వాలిఫయర్‌కు అర్హత సాధించింది. గుజరాత్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ముంబై ఓపెనర్లు చెలరేగారు. గుజరాత్ ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం కూడా ముంబైకు కలిసొచ్చింది. రోహిత్ శర్మ (81), జానీ బెయిర్‌స్టో (47) తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. బెయిర్ స్టో అవుటైన తర్వాత



వచ్చిన సూర్యకుమార్ (33) చూడచక్కని షాట్లతో అలరించాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (25) కూడా మూడు సిక్స్‌లు కొట్టాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (22) కూడా వేగంగా పరుగులు చేశారు. చివరకు ముంబై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీశారు. 229 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్లోనే గిల్ (1)ను బౌల్ట్ పెవిలియన్‌కు పంపాడు. అయితే మరో ఓపెనర్ సాయి సుదర్శన్ (80) తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. ఒత్తిడిలో కూడా చూడచక్కని షాట్లతో అలరించాడు. వాషింగ్టన్ సుందర్ (48)తో కలిసి గుజరాత్‌ను గెలిపించే ప్రయత్నం చేశాడు. అయితే వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో అవుట్ కావడంతో గుజరాత్ వెనకడుగు వేసింది. చివర్లో రూథర్‌ఫర్డ్ (24), రాహుల్ తెవాటియా (16) పోరాడినా ఫలితం లేకపోయింది. చివరకు గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 పరుగులు మాత్రమే చేయగలిగింది. 20 పరుగుల తేడాతో ఓడిపోయింది.

## సడన్‌గా ఇంగ్లండ్‌కు కేఎల్ రాహుల్. ఎందుకంటే




**మే 30 ప్రజా స్వేచ్ఛ**

టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ హుటాహుటిన ఇంగ్లండ్ వెళ్లనున్నాడు. సోమవారం అతను ఇంగ్లండ్ వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాడు. జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు రెడీ అవుతున్న సీనియర్ టీమిండియా క్రికెటర్.. ప్రిపరేషన్ కోసం ముందే వెళ్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపు ఆడిన కేఎల్ రాహుల్.. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో టూరు చేస్తున్న ఇండియా ఏ జట్టు తరపున ఆడాలనుకుంటున్నాడు. సీనియర్ల టెస్టు సిరీస్ కు ఎంపికైన అతను.. ప్రాక్టీసు కోసం ముందే ఇంగ్లండ్‌కు వెళ్లాలనుకుంటున్నాడు. దీని కోసం అతను బీసీసీఐ నుంచి పర్మిషన్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు టెస్టు మ్యాచ్ ఆడనున్నది. మే 30వ తేదీ నుంచి క్యాంటర్ బరీలో తొలి టెస్టు జరగనున్నది అయితే ఆ మ్యాచ్‌ను రాహుల్ అందుకోలేడు. కానీ రెండవ మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతి పొందిన కేఎల్ రాహుల్.. తొందరగా ఇంగ్లండ్ వెళ్లేందుకు రెడీ అయ్యాడు. సోమవారం ఇంగ్లండ్‌కు రాహుల్ వెళ్తున్నాడని, ఇండియా ఏ తరపున రెండో అనధికార టెస్టులో ఆడనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. జూన్ 6వ తేదీన ఇండియా ఏ, ఇంగ్లండ్ లయన్స్ జట్ల మధ్య రెండో అన్‌అఫీషియల్ టెస్టు ప్రారంభంకానున్నది. ఇక సీనియర్ మెన్స్ క్రికెట్ జట్టు జూన్ 13వ తేదీన ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జూన్ 20వ తేదీ నుంచి లీడ్స్‌లో ప్రారంభంకానున్నది.

## ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలవకపోతే.. నా భర్తకు విడాకులిస్తా

**మే 30 ప్రజా స్వేచ్ఛ**

ఐపీఎల్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'ఈ సాలా కప్ నమదే' నినాదంతో ప్రతిసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ.. 18వ సీజన్‌లో ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచింది. లీగ్ దశ నుంచి అదరగొట్టిన బెంగళూరు జట్టు క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయంతో అంతిమ పోరుకు అర్హత సాధించింది. దాదాపు తొమ్మిదేండ్ల తర్వాత ఆర్‌సీబీ తుది పోరుకు అర్హత సాధించడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఆనందాలకు అవధుల్లేవు. ఈ సారి ఎలాగైన జట్టు




గెలుస్తుందన్న ధీమాతో ఉన్నారు. గురువారం మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో ఆర్సీబీ ఫ్యాన్స్ సందడి చేశారు. జట్టుకు మద్దతుగా పెద్ద ఎత్తున ప్లకార్డులను ప్రదర్శించారు. తమ అభిమాన క్రికెటర్‌కు ఛీరప్ ఇచ్చారు. ఈ క్రమంలో ఓ యువతి ప్రదర్శించిన ప్లకార్డ్ ఆసక్తికరంగా మారింది. ఈ సారి ఫైనల్లో ఆర్సీబీ జట్టు గెలవకపోతే తన భర్తకు విడాకులు ఇచ్చేస్తా అంటూ పేర్కొంది. 'ఈ సారి ఫైనల్లో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ టైటిల్ గెలవకపోతే.. నా భర్తకు విడాకులు ఇస్తా' అంటూ ప్లకార్డును ప్రదర్శించింది. దానిపై 'కింగ్ కోహ్లీ' హ్యాష్‌ట్యాగ్ జోడించింది. ప్రస్తుతం ఈ ఫొటో తెగ వైరల్ అవుతోంది.



# పోలీస్ గెటప్ లో వరలక్ష్మి శరత్ కుమార్

వరలక్ష్మీ శరత్ కుమార్ తమిళ్ బ్యూటీ అయినప్పటికి... తెలుగులో మంచి క్రేజ్ ను సంపాదించుకుంది. ఏ రోల్ చేసిన ఆ క్యారెక్టర్ కు ప్రాణం పోస్తుంది. అందుకే హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో బిజీగా మారింది. పైగా పెళ్లి తర్వాత మరింత స్పీడ్ ను పెంచింది. నెగిటివ్ రోల్స్, సపోర్టింగ్ రోల్స్, వెబ్ సీరిస్ తో పాటు లేడీ ఓరియెంటెంట్ మూవీస్ లో నటిస్తోంది. త్వరలో ఆమె 'పోలీస్ కంప్లెయింట్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. ఈ పోస్టర్‌లో వరలక్ష్మి గన్ ఫైర్ చేస్తూ సీరియస్ లుక్‌లో కనిపించి మెప్పించడంతో పాటు సినిమాపై అంచనాలు పెంచింది.హారర్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో సరికొత్త కాన్సెప్ట్ తో 'పోలీస్ కంప్లెయింట్' మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ రోల్ తో పాటు వినోదాన్ని కలిగించే క్యారెక్టర్ లో వరలక్ష్మి నటిస్తోంది. ఈ చిత్రాన్ని సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించగా, శ్రీ హర్ష , నవీన్ చంద్ర , రాజశ్రీ నాయర్ , కృష్ణ సాయి , రాగిణి ద్వివేదొ , రవిశంకర్ ఆదిత్య ఓం వంటి వారు కీలక పాత్రలలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... ఈ చిత్రాన్ని 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్టు మేకర్స్ వెల్లడించారు. ఈ మూవీలో సూపర్ స్టార్ కృష్ణ మీద ఎ.ఐ. టెక్నాలజీతో స్పెషల్ సాంగ్ ను షూట్ చేసామని, అది సినిమాకే మెయిన్ హైలెట్‌గా నిలుస్తుందని తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీలో ఆడియెన్స్ ను థ్రిల్ కు గురి చేసే ఎలిమెంట్స్ చాలా ఉంటాయన్నారు. మరి పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా వరలక్ష్మి ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే..

## స్పందించిన నటి

టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. అయితే ఇటీవల ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.తాజాగా ఈ వార్తలపై స్పందించింది రాధికా ఆప్టే. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తాను ఈ సినిమాలో భాగమైనట్లు తనకే తెలియదని రాధికా ఆప్టే సరదాగా చెప్పారు. ఇలాంటి ఊహాగానాలు తనకు ఆశ్చర్యం కలిగిస్తాయని, ఈ వార్తల గురించి తనకేమీ తెలియదని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు చాలా ఫన్నీగా అనిపిస్తాయని వెల్లడించారు. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం



# టాలీవుడ్ హీరో కోసం సూర్య సినిమాకు నో చెప్పిన కీర్తిసురేష్..

## కారణం ఏంటంటే

టాలీవుడ్ లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా మారిన ముద్దుగుమ్మల్లో కీర్తిసురేష్ ఒక రు. టాలీవుడ్ లో నేను శైలజ సినిమాతో పరిచయమైన ఈ భామ చైల్డ్ ఆర్టిస్ట్ గాను పలు సినిమాల్లో నటించి మెప్పించింది. కీర్తిసురేష్ హీరోయిన్ గా తమిళ్ సినిమాతో పరిచయమైనప్పటకి..మలయాళంలో పలు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించి మెప్పించింది. 2015లో వచ్చిన ఇదు ఎన్న మాయం సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది కీర్తి.. ఆ తర్వాత అదే ఏడాది వచ్చిన నేను శైలజ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ చిన్నది. ఆ తర్వాత మహానటి సినిమాతో పాపులర్ య్యింది. ఈ సినిమాకు ఏకంగా జాతీయ అవార్డు కూడా అందుకుంది. ఇక ఇప్పుడు తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది.కీర్తి ఇటీవలే పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.. అయితే రీసెంట్ గా బాలీవుడ్ లోనూ సినిమా చేసింది కీర్తి. బేబీ జాన్ అనే సినిమాతో అక్కడ పరిచయం అయ్యింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు వరుస సినిమాతో బిజీ కానుందని తెలుస్తుంది. ఇదిలా ఉంటే ఇప్పుడు సూర్య నటిస్తున్న సినిమా ఆఫర్ ను కీర్తి రిజెక్ట్ చేసిందని టాక్ వినిపిస్తుంది. టాలీవుడ్ హీరో సినిమా కోసం కీర్తి సూర్య సినిమా ఆఫర్ కు నో చెప్పిందని అంటున్నారు. ఆ హీరో ఎవరో కాదు రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ.



# కోహ్లీ లైక్ కొట్టడంపై రకుల్ కామెంట్..

## మనం ఇంత ఖాళీగా ఉన్నామా..!

కింగ్ కోహ్లీకి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అతను ఇప్పటికీ కుర్రాళ్లకి పోటీగా క్రికెట్ ఆడుతున్నాడు. ఆయన కనిపిస్తే అభిమానులు పూనకాలు వచ్చినట్టు ఊగిపోతుంటారు. ఇక సోషల్ మీడియాలో విరాట్ కోహ్లీని ఫాలో అయ్యే వారు చాలా ఎక్కువే. అయితే కోహ్లీ ఇటీవల ఓ హాట్ బ్యూటీ ఫొటోకి లైక్ కొట్టాడు. దాంతో ఒక్కసారిగా అతని ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్లంతా షాక్ అయ్యారు. విరాట్ కోహ్లి ఏంటీ ఈ బ్యూటీ ఫొటోకి లైక్ కొట్టడం ఏంటని అంతా అవాక్కయ్యారు. ఇలా ఎలా జరిగింది అని తెలుసుకునేలోపే ఈ విషయం సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయింది.బాలీవుడ్ బ్యూటీ అవనీత్ కౌర్ ఇటీవల తన గోవా ఫొటోషూట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆ పోస్ట్ కింద విరాట్ కోహ్లి లైక్ కనిపించింది. అయితే బోల్డ్ ఫొటోస్‌తో రచ్చ చేసే ఈ బ్యూటీ ఫొటోకి కోహ్లీ లైక్ కొట్టడం చర్చనీయాంశం అయింది.ఇది పెద్ద ఇష్యూగా మారుతుండటంతో నేరుగా కోహ్లినే స్పందించాల్సి వచ్చింది. నా ఫీడ్ క్లియర్ చేసేటప్పుడు బహుశా అల్గారిథం పొరపాటు వల్ల ఇలా జరిగి ఉండొచ్చు. దీని వెనుక ఎలాంటి ఉద్దేశం లేదు. అనవసర ఊహాగానాలు చేయొద్దంటూ రిక్వెస్ట్ చేశారు. అర్థం చేసుకున్నందుకు థ్యాంక్స్ అని కూడా కోహ్లీ తన కామెంట్‌లో తెలియజేశాడు. అయితే ఈ ఇష్యూ గురించి తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ స్పందించింది. నటి అవ్‌నీత్ కౌర్ ఫ్యాన్ పేజీలోని ఓ పోస్ట్‌ను విరాట్ కోహ్లీ లైక్ చేయడంతో ఆమెకి ఏకంగా 2 మిలియన్ల మంది ఫాలోవర్లు పెరిగారట. ఇది చాలా బాధ కలిగించే విషయం. మనమంతా ఇంత ఖాళీగా ఉన్నామా అనిపిస్తోంది అంటూ రకుల్ కాస్త చురకలు అంటించింది. అసలు ఆ లైక్ విరాట్ కోహ్లీ కావాలని చేశాడా, లేదంటే అనుకోకుండా జరిగిందా అని ఎవరు ఆలోచించడం లేదు. ఒక్కోసారి మనం ఇన్‌స్టాగ్రామ్‌లో మన స్నేహితులనే పొరపాటున అన్‌ఫాలో చేస్తుంటాం. కోహ్లీ సెలబ్రిటీ కాబట్టి ఆయనకు సంబంధించిన చిన్న విషయాలను కూడా అంతలా వైరల్ చేస్తున్నారు. సెలబ్రిటీలకు సంబంధించిన చిన్న చిన్న విషయాలను కూడా ప్రజలు మరింత లోతుగా విశ్లేషిస్తూ సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేస్తున్నారని రకుల్ అభిప్రాయపడ్డారు. నా దృష్టిలో ఇది పూర్తిగా అనవసరం అంటూ రకుల్ పేర్కొంది

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492